AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

31-5-2026

NIZAMABAD / KAMAREDDY

PAGES - 2


## ఘనంగా పోచమ్మ పండుగ



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకోగా డప్పువాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించారు. గ్రామ పొలిమేరల్లోని ఆలయానికి వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. పాడి, పంటలను చల్లంగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు.



## ఈహెచ్‌ఎస్ పేరిట జీతాల కోత సరికాదు

**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాల నుంచి ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయీ హెల్త్ స్కీమ్) పేరుతో ఎటువంటి స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా నెలవారీ సబ్‌స్క్రిప్షన్ కోత విధించడం సరికాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఖండించింది. తపస్ సంఘం నాయకులు ఆదివారం బాన్సువాడలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పూర్తిగా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమని తెలిపారు. మూడు సంవత్సరాలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీ, వివిధ రకాల బకాయిలను చెల్లించడంలో విఫలమైందన్నారు. ఈహెచ్‌ఎస్ పేరుతో జీతాల్లో కోత విధించడం అన్యాయమని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి పెట్టకుండా ఆర్థిక భారం మోపడం సరైంది కాదన్నారు. ఈ నిర్ణయాన్ని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బోనెకర్ సంతోష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో నకిలీ వైద్యుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఎలాంటి అర్హత లేకున్నా పలువురు చికిత్సలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎటువంటి డిగ్రీలు, కనీస అర్హత లేకున్నా క్లినిక్‌లు నిర్వహిస్తూ, రోగులకు ప్రమాదకరమైన ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ ఇస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. గత రెండేళ్లు గా తెలంగాణ మెడికల్ కౌన్సిల్, పోలీసులు సంయుక్తంగా చేపట్టిన దాడుల్లో వందలాది మంది నకిలీ వైద్యుల అక్రమ దందాలు బట్టబయలయ్యాయి. – అక్షరటుడే, భీమ్‌గల్

# ప్రజల ప్రాణాలతో చెలగాటం

- ఉమ్మడి జిల్లాలో నకిలీ వైద్యుల ఆగడాలు
- ఎలాంటి అర్హత లేకుండానే చికిత్సలు
- తనిఖీల్లో వెలుగు చూస్తున్న బాగోతాలు

ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. కానీ జిల్లాలో పలువురు ఏకంగా వైద్యం చేస్తున్నారు. పెద్ద పెద్ద వ్యాధులకు సైతం ట్రీట్‌మెంట్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. సెలైన్లు పెట్టడం, ఇంజక్షన్లు ఇవ్వడం చేయొద్దు. కానీ ఆర్ఎంపీ, పీఎంపీలు ఈ నిబంధనలు పాటించడం లేదు. అంతేగాకుండా చాలామంది ఎలాంటి అర్హత లేకుండానే క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

### అధికారుల తనిఖీలు

నిజామాబాద్ నగరంలోని బోధన్ బస్టాండ్, ఖలీల్‌వాడి ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు జరిపిన తనిఖీల్లో ఇద్దరు నకిలీ వైద్యులు పట్టుబడ్డారు. వీరు ఎటువంటి వైద్య పట్టా లేకుండానే 'ఫస్ట్ ఎయిడ్' ఆసుపత్రులు నిర్వహిస్తూ రోగులకు గ్లూకోజ్, ఇంజక్షన్లు ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వన్ టౌన్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. మెడికల్ కౌన్సిల్ అధికారులు మోస్రా, చందూర్, వర్ని, నస్రుల్లాబాద్, బీర్కూర్, జుక్కల్, పిట్లం మండలాల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 15 మందికి పైగా వ్యక్తులు అర్హత లేకుండా వైద్యం చేస్తున్నట్లు గుర్తించి, వారిపై ఎన్.ఎమ్.సి చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.

### విషాదకర ఘటనలు

నకిలీ వైద్యులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఓవర్‌డోస్ మందులతో 2025 ఆగస్టులో నందిపేట మండలంలో ఒక యువతి మృతి చెందింది. శక్తివంతమైన యాంటీబయాటిక్ ఇంజక్షన్లు ఇవ్వడంతో, ఆమెకు రియాక్షన్ అయి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, సదరు వ్యక్తికి ఎలాంటి అర్హత లేదని నిర్ధారించారు. భీమ్‌గల్ మండలంలో కొద్ది నెలల క్రితం జరిగిన మరో ఘటనలో అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి క్లినిక్‌లో స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ అధిక మోతాదులో ఇవ్వడంతో కిడ్నీలు దెబ్బతిని మరణించాడు.

### యాంటీబయాటిక్స్ దుర్వినియోగం

జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు మారుమూల గ్రామాల్లో కొందరు ఆర్ఎంపీలు కేవలం చిన్న జలుబు, దగ్గుకు కూడా అధిక డోస్ ఉన్న యాంటీబయాటిక్స్ ఇస్తున్నారు. దీంతో ప్రజల శరీరాల్లో 'యాంటీబయాటిక్ రెసిస్టెన్స్' పెరిగి, భవిష్యత్తులో చిన్నపాటి వ్యాధులు కూడా తగ్గని పరిస్థితి నెలకొంటోంది. అత్యవసర సమయంలో కూడా వీరు ప్రాథమిక చికిత్స చేయకుండానే సెలైన్లు, ఇంజక్షన్లు ఇస్తుండడంతో, రోగులు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు.



## ఐడీఏ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో అవగాహన ర్యాలీ, గంజ్ ప్రాంగణంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి ప్రారంభించారు. ప్రజలు నోటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ రఘు రావుట్ల, కార్యదర్శి డాక్టర్ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ.. యువత పొగాకు, నికోటిన్ ఉత్పత్తులను మానుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఉచితంగా దంత పరీక్షలు చేసి, వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో ఐడీఏ సీనియర్ సభ్యులు నందకుమార్, ప్రతాప్ కుమార్, వ్యావహారే, శ్రీనివాస్, సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వరి కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రాజకీయం: మానాల



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** రాష్ట్రంలో వరి కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అసత్య ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి మండి పడ్డారు. తమ స్వార్థ రాజకీయాల కోసం అన్నదాతలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. కమ్మర్‌పల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సీజన్లలో ఎప్పుడు కూడా రైతులకు ఇబ్బంది కలిగే పరిస్థితి రాకుండా చూసుకున్నామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో కొంత లారీల కొరతతో రైస్ మిల్లర్ల ఇబ్బంది పెట్టిన సందర్భంగా కొంత ఇబ్బంది అయిన మాట నిజమేనని మానాల అన్నారు. కానీ ఎక్కడ కూడా వద్దు కొనుగోలు చేయబోమని చెప్పలేదన్నారు. గతంలో కేసీఆర్ చెప్పినట్టు 'వరి వేసుకుంటే ఉరే' అనే మాటలు మాట్లాడలేదన్నారు. ఎంఎస్పీ ధర నిర్ణయించే కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసే బాధ్యత ఎందుకు తీసుకోదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 1,50,000 మెట్రిక్ టన్నుల వరి సేకరణ చేస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం 30 వేల టన్నులు మాత్రమే మేం తీసుకుంటామని చెప్పడం సరైంది కాదని మండిపడ్డారు. దీనిపై మాట్లాడాల్సిన బాధ్యత రాష్ట్ర బీజేపీ నాయకులకు లేదా ప్రశ్నించారు. అలాగే జిల్లాకు చెందిన మాజీ మంత్రి నాగిరెడ్డిపేట మండలంలో వరి రైతుల వద్దకు వెళ్లి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ ఇలా జరగనట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీ సొంత గ్రామంలోనే చుట్టుపక్కల రైస్ మిల్లు దగ్గర గోధుములు లేవనే విషయం మర్చిపోవద్దన్నారు. నీ గ్రామంలోని ఆగిపోయిన రైస్ మిల్లు తీసుకొని ఎప్పటికప్పుడు అందులో కూడా మేం వద్దు స్టోరేజ్ చేస్తున్నది మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బోనగిరి భాస్కర్, మాజీ అధ్యక్షుడు సుంకెట రవి, మాజీ డీసీసీ తిప్పిరెడ్డి శ్రీనివాస్, కమ్మర్‌పల్లి టౌన్ అధ్యక్షుడు సాల్లూరి గణేష్, కుకునూరు సర్పంచ్ భూమారెడ్డి, పడగల సర్పంచ్ రాజు, అక్లూర్ సర్పంచ్ జనార్దన్, అంక్సాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, నరేష్, గోపాల్ అరవింద్, బైండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నో టొబాకో డే సందర్భంగా అవగాహన ర్యాలీ



**అక్షరటుడే, కామారెడ్డి/బాన్సువాడ:** ప్రపంచ నో టొబాకో డే సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన దంత వైద్యులు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నిజాంసాగర్ చౌరస్తా నుంచి ప్రారంభమై మున్సిపల్ కార్యాలయం మీదుగా తిరిగి నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకుంది. అనంతరం సిగరెట్ దిష్టిబొమ్మను దహనం చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవన్ మాట్లాడుతూ.. పొగాకు, గుట్కా, సిగరెట్ వంటి దురలవాట్ల బారిన పడి యువత తమ జీవితాలను అర్ధాంతరంగా ముగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అలవాట్ల కారణంగా ప్రజలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారని.. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్, రాష్ట్ర బాధ్యులు డాక్టర్ సాజిద్, కామారెడ్డి జిల్లా కోశాధికారి డాక్టర్ కవిత, వినోద్, ప్రవీణ్, డాక్టర్ నాగరాజ్, పలువురు దంత వైద్యులు పాల్గొన్నారు.



## మండుతున్న ఎండలు.. ఈతతో ఉపశమనం

ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామంలో పిల్లలు ఎండ వేడిని తట్టుకోలేక గ్రామ శివారులోని బావిలో ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు. అయితే ఈత సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

\- అక్షరటుడే, ఎల్లారెడ్డి

## పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గంజ్ ప్రాంగణంలో ఉచిత దంత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ర్యాలీ సందర్భంగా ప్రజలకు పొగాకు, నికోటిన్ ఉత్పత్తులతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఐడీఏ అధ్యక్షుడు రఘు రావుట్ల, కార్యదర్శి సుగుణాకర్ రాజు, సీనియర్ సభ్యులు మాట్లాడారు. యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని, క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. గంజ్ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి ప్రారంభించారు. ప్రజలు నోటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు దంత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు నందకుమార్, ప్రతాప్ కుమార్, వ్యవహారే, శ్రీనివాస్, సాంబశివరావు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అక్షరటుడే, నందిపేట :** నందిపేట మండలం వెల్మల్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 20002001 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒకచోట కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులు సత్యం రెడ్డి, పెద్ద గంగారెడ్డి, చిన్న గంగారెడ్డి, గంగాధర్, లక్ష్మీపతి, గోపాల్, సరోజని, ప్రభాకర్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కస్ప రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, అల్లకొండ లింగం, బైనసాగర్, బండ కాడి గంగారెడ్డి, భోగ రాము, గంగమల్లు సురేష్, అశోక్, తిరుమలేష్, వన్నెల దాస్ శేఖర్, కేజీ మైపాల్, బైన మహిపాల్, మోహన్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతం కోసం పని చేయాలి



**అక్షరటుడే, భీమ్‌గల్ :** రాబోయే అన్ని ఎన్నికల్లో భీమ్‌గల్ మండలంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేసే దిశగా కార్యకర్తలందరూ ఐక్యతతో పని చేయాలని పార్టీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, టౌన్ అధ్యక్షుడు పర్స అనంతరావు పిలుపునిచ్చారు. ముచ్కూర్, పిప్రి, పల్లికొండ, పూరాణీపేట్ గ్రామాల కాంగ్రెస్ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు నూతన అధ్యక్షులను ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

## పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత

**అక్షరటుడే, ఆర్మూర్ :** పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని దీనికోసం ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనిలో గల ప్రకృతి వనంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందిచాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బట్టు సుమన్, జంగిడి భోజన్న, జహీర్, గణేష్, శ్యాంసుందర్, డ్రైవింగ్ స్కూల్ వేణు, యాదగిరి, రాహుల్ రాజ్, సంతోష్, రఘువరన్, సాయి పాల్గొన్నారు.



## 'మన్ కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నాయకులు

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆదివారం వీక్షించారు. కార్యక్రమానికి పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి పిలుపు మేరకు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా స్వదేశీ వస్తువుల వినియోగాన్ని పెంచాలని కోరారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సుర శ్రీకాంత్, మన్ కీ బాత్ ఇన్‌ఛార్జి బండారు యాదగిరి, డాక్టర్ అరుణ్, కల్లెడ సర్పంచ్ సుష్మితప్రళయ్, సుభాష్, ఎర్రం రమేష్, మల్లయ్య, అఖిలేష్, ప్రమోద్, గణేష్, తొర్లికొండ సాయన్న, మామిడి గంగారెడ్డి, సురేష్‌గౌడ్, మగ్గిడి గంగారెడ్డి, శివకేశవులు పాల్గొన్నారు.

"సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెంచడమే లక్ష్యం. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా పేదలకు పథకాలు కచ్చితంగా అందేలా, అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించేలా వ్యవస్థను తీర్చిదిద్దుతాం." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు.




# ప్రజా సంక్షేమానికి యూనిఫైడ్ బాట

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ఇకపై ఒకే కార్డు పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పథకాల అమలును ఒకే చోట కేంద్రీకరించడం ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించనుంది. ఇందుకోసం 'సమగ్ర సంక్షేమ కార్డు'ను (యూనిఫైడ్ కార్డు) త్వరలో జారీ చేసేందుకు చర్యలు చేపడుతోంది.

- అక్షరటుడే, భీమ్‌గల్

■ ప్రతి పౌరుడికి ఒకే కార్డు.. ■ పారదర్శకంగా పథకాల పంపిణీ ■ జిల్లావ్యాప్తంగా 3.69 లక్షల కుటుంబాల డేటా అనుసంధానంపై దృష్టి

'సమగ్ర సంక్షేమ కార్డు'ను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాకు సంబంధించి 3,69,031 కుటుంబాల సామాజిక, ఆర్థిక వివరాలను దీనితో అనుసంధానించనుంది. డేటా అనుసంధానం తర్వాత ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులకే చేరేలా చర్యలు చేపట్టనున్నారు.

### సంక్షేమ కార్డుతో కలిగే ప్రయోజనాలు..

- ఒక వ్యక్తి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత లబ్ధి పొందుతున్నాడో ఈ కార్డు ద్వారా ఒక్క క్లిక్‌తో తెలుస్తుంది.
- ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలోని వివరాలను దీనికి అనుసంధానించడం ద్వారా, నిజమైన లబ్ధిదారులను గుర్తించడం, అనర్హులను తొలగించడం సులభతరమవుతుంది.
- ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల వివరాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయి.

### అధికారుల సమన్వయంతోనే సాధ్యం..

ఈ ప్రక్రియను ఐటీ శాఖ పర్యవేక్షించనుంది. ఆధార్ తరహాలో రాష్ట్ర స్థాయి 'యూనిక్ ఐడెంటిటీ నంబర్' ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా, మరణించిన వారి పేర్లు తొలగించడం, కొత్త లబ్ధిదారులను చేర్చడం వంటివి మరింత పారదర్శకంగా జరగనున్నాయి.

### త్వరలో ప్రత్యేక డ్రైవ్..

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు జిల్లా యంత్రాంగం త్వరలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది. ఈ డేటా సేకరణలో తప్పులు లేకుండా, ప్రతి ఇంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

## బీరప్ప ఆలయానికి విరాళం


**అక్షరటుడే, బోధన్:** మాక్లూర్ మండలంలోని చిక్లి గ్రామంలో బీరప్ప ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా బినోల సొసైటీ ఛైర్మన్ మగ్గరి హనుమాండ్లు రూ.ఐదువేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.





## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఉమ్మెడ జగదీష్, వెంకటలక్ష్మి, పాలకుర్తి శ్రీనివాస్, ఎంఏ నావీద్, నాగరాజు, రాజన్నలకు ఆదివారం పోలీస్ స్టేషన్లో ఫోన్‌లను అందించారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో 'మోడల్' విద్యార్థులకు సీట్లు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. ఆర్. శ్రీదీప్, పీ. హర్షిత్ కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో శ్రీదీప్ 574 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. హర్షిత్ కుమార్ 565 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. విద్యార్థుల ఎంపికపై స్కూల్ ప్రిన్సిపల్ రాం ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.




## ముగిసిన సమ్మర్ క్యాంపు

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. విద్యార్థులలో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ద్వారా విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం లభించిందన్నారు. గ్రామ సర్పంచ్ మహేష్ యాదవ్, పాఠశాల ఛైర్మన్ రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేవుడి దీపంతో అగ్ని ప్రమాదం.. రెండిళ్లు దగ్ధం

**అక్షరటుడే, మెండోరా:** దేవుడి వద్ద వెలిగించిన దీపంతో మంటలు అంటుకొని రెండు ఇళ్లు కాలిపోయాయి. ఈ ఘటన మెండోరా లో చోటు చేసుకుంది. మెండోరా గ్రామానికి చెందిన కుమ్మరి రాజరాపు బక్కన్న భార్య పద్మ ఇంట్లో దేవుని వద్ద దీపం వెలిగించింది. అనంతరం బయటకు రాగానే కొద్దిసేపటికి ఇంట్లో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ఉన్న బక్కన్న అన్న రాజేశ్వర్ ఇంటికి కూడా వ్యాపించడంతో రెండు ఇళ్లలో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి వాటిని అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే రెండు ఇళ్లలోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బక్కన్న ఇంట్లో రూ.15,800 నగదుతో పాటు గృహోపకరణాలు కాలిపోగా, రాజేశ్వర్ ఇంట్లో రూ.8,000 నగదు ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో రెండు ఇళ్లకు కలిపి సుమారు రూ.25 వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు రెవెన్యూ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. స్థానిక అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



## ఆర్మూర్‌లో గ్యాస్ లీకేజీ.. ఇద్దరికి గాయాలు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ పట్టణంలో గ్యాస్ లీకేజీ అయినా ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కాశీ హనుమాన్ గల్లీలో రాజేష్, ఆయన తల్లి రుకుమ్ బాయ్ చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం చికెన్ కాలుస్తున్న క్రమంలో ఒక సారిగా మంటలు వ్యాపించడంతో తల్లి, కొడుకులకు ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

## కామారెడ్డిలో వ్యక్తి దారుణ హత్య



**అక్షరటుడే, కామారెడ్డి :** ఇంట్లోనుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి రాజిరెడ్డి (55) ఈ నెల 29 న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి అడిగినా, బంధువుల వద్ద ఆరా తీసినప్పటికి రాజిరెడ్డి ఆచూకీ లభించలేదు. దాంతో శనివారం రాజిరెడ్డి కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రాజిరెడ్డికి గ్రామానికి చెందిన ఓ కుటుంబంతో భూ తగాదాలు కొనసాగుతున్నట్టుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. అదే సమయంలో శనివారం సాయంత్రం గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాలు సమీపంలోని వ్యవసాయానికి బావిలో రాజిరెడ్డిని హత్య చేసి పూడ్చిపెట్టినట్టు పోలీసులు గుర్తించారు. రాజిరెడ్డి హత్యతో గ్రామంలో ఉద్రిక్త పరిస్తితులు నెలకొన్నాయి. డీఎస్పీ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు మధ్య బావిలో నుంచి శనివారం అర్ధరాత్రి రాజిరెడ్డి మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. భూ తగాదాల నేపథ్యంలోనే రాజిరెడ్డి హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణ కొనసాగితుందని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని డిఎస్పీ తెలిపారు. కాగా హత్యకు పాల్పడిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

## గొర్రెలను కడగడానికి వెళ్లి నీటమునిగి ఇద్దరు మృతి




**అక్షరటుడే, కోటగిరి:** గొర్రెలు కడగడానికి వెళ్లి ఇద్దరు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం పోతంగల్ గ్రామానికి చెందిన కుర్మ గంగొండ (45) తన గొర్రెలను తీసుకొని తన కొడుకు కుర్మ సంతోష్, చిక్కల గంగారం ఇద్దరు కలిసి మంజీర నదిలోకి గొర్రెలను కడగడానికి ఆదివారం వెళ్లారు. ప్రమాదవశాత్తు గంగారం కాలుజారి నదిలో పడిపోయాడు. దీంతో గంగొండ అతడిని కాపాడడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరు కలిసి నీటిలో మునిగి చనిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సీసీ రోడ్డుకు మరమ్మతులు



**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్ గ్రామంలోని 10వ వార్డు సభ్యుడు నజీర్ సీసీ రోడ్ల మరమ్మతు పనులను సొంత ఖర్చులతో చేపట్టారు. వార్డులోని రోడ్ల దుస్థితిని గమనించిన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మిస్బావద్దీన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నజీర్ స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజల అవసరాలను గుర్తించి సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

## ప్రతిభావంతులైన మాదిగ విద్యార్థులకు సన్మానం

**అక్షరటుడే, భీమ్‌గల్:** విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని 'మాదిగ ఐక్యవేదిక కమిటీ' సభ్యులు, భీమ్‌గల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ సంటి లతా పిలుపునిచ్చారు. భీమ్‌గల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎంపిక చేసిన 150 మంది ప్రతిభావంతులైన మాదిగ విద్యార్థులను 'మాదిగ ఐక్యవేదిక కమిటీ' ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ సూర్జిల్ బాబు, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ పోచన్న హాజరై విద్యార్థులకు మెమోంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షుడు గడలా ప్రసాద్, జేజే నర్సన్న, చెప్పాల గణేష్, చెంగల్ సర్పంచ్ రాజు, జి.రాజేశ్వర్, టి.అశోక్, దశరథ్, చౌదరి, యోనా, రతన్, రాజేందర్, సాయిబాబా, ముత్యన్న, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

